www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 7 మార్చి 2023

పెట్టుబడులపై వివరణ ఇవ్వాలి

తిరుమల : విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయన్న ప్రకటన పై మంత్రి గుడివాడ అమర్నాథ్ వివరణ ఇవ్వాలని బిజెపి నేత విష్ణువర్ధన అన్నారు. సోమవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌కు ముందు మంత్రి గుడివాడ అమర్నాథ్ రెండు లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని చెప్పారని, కానీ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ నిర్వహించిన అనంతరం ముఖ్యమంత్రి 13 లక్షల కోట్లు వచ్చాయని చెప్పడం చాలా వ్యత్యాసం ఉందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులకు సంబంధించిన విషయంలో అంచనా లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లను కొనుగోలు చేసిన సంఘటనలు చూశామని, కానీ కొత్తగా 13న జరగనున్న శాసనమండలి ఎన్నికల్లో పట్టభద్రులు కూడా ఓటర్లను కొనుగోలు చేసే పరిస్థితి రావడం మంచి పద్ధతి కాదని ఆయన అన్నారు.

దుక్కి దున్నుతూ... మందులు చల్లుతూ..

వ్యవసాయ పనుల్లో రాణింపు

ప్రజాశక్తి - బాలాయపల్లి

'సమాజ పరిణామ క్రమంలో' వ్యవసాయాన్ని కనిపెట్టింది మహిళలే అన్న విషయం వాస్తవం.. అయితే పెత్తందారీ పాలనలో మహిళలను కేవలం వంటింటికే పరిమితం చేశారు. వ్యవసాయంలోనూ కేవలం కోతలు, నాట్లకే పెట్టుకుని పనులు చేయిస్తున్నారు. కూలి డబ్బులు ఇవ్వడంలోనూ వివక్ష చూపిస్తూ పురుషులకు ఒకలా, మహిళలకు మరోలా ఇస్తూ ఇప్పటికీ మహిళా కూలిని తేడాగానే చూస్తున్నారు. అయితే ఆధునిక మహిళ వ్యవసాయంలోనూ పురుషులతో పోటీ పడుతోంది. ఏ పనైనా చేసి తీరుతానని చెప్పడమే కాదు, ఆచరణలో చేసి చూపిస్తోంది. దుక్కి దున్నడం, విత్తనాలు చల్లడమే కాదు, ఏకంగా మందులను సైతం మహిళలు స్ప్రే చేస్తున్నారు. వ్యవసాయ పనుల్లో రాణిస్తున్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఈ ఏడాది (2023) థీమ్ 'డిజిటల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ జెండర్ ఈక్వాలిటీ' పేరుతో వారోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. వివక్షను బద్దలు కొడదాం. ఆడపిల్ల విద్యని ప్రోత్సహించడం, సమాజంలోని అన్ని విభాగాల నుంచి లింగ పక్షపాతాన్ని తొలగించాలనే ఉద్దేశంతో ఈ థీమ్ పెట్టారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహిళలు దూసుకుపోతూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నా ఎక్కడో ఒక చోట వివక్షత ఎదుర్కొంటూనే ఉన్నారు. ఆ వివక్ష గోడలు బద్ధలు కొట్టేందుకు ఏటా కషి చేస్తూనే ఉన్నారు.

అడుసు దున్నుతున్న మహిళ

మందులు పిచికారీ చేస్తున్న మహిళ

ఆలోచనల్లో మార్పు రావాలి

చట్టాలే మహిళల అభివృద్ధికి పరిష్కారం కాదు.. ఆలోచనల్లో మార్పు రావాలి. అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా పరిస్థితులు బయటకు వెళ్లనిచ్చేలా లేవు. ఏ పని చేస్తున్నా 'ఆడపిల్లకు నీకు అవసరమా?' అని దెప్పి పొడుస్తూనే ఉంది. కొన్నేళ్ల కిందట మహిళలు చదువుకోవాలంటే ఎంతో కష్టపడాల్సి వచ్చేది. ఇప్పుడు జాతీయంగా, అంతర్జాతీయంగా ఎన్నో మార్పులు వచ్చాయి. అప్పట్లో తల్లిదండ్రులే పిల్లల పెంపకంలో తేడాలు చూపించేవారు. అమ్మాయి, అబ్బాయి ఒకే పాఠశాలలో చదువుతున్నా ఇంటి పనులన్నీ ఆడపిల్లతోనే చేయించేవారు. మగవాళ్లు అన్నింట్లో ఎక్కువ అనే మనస్తత్వం అందరిలోనూ ఉండేది. అప్పటితో పోలిస్తే ఇలాంటి విషయాల్లో ఎంతో కొంత మార్పు వచ్చింది. కానీ పూర్తి స్థాయిలో లింగసమానత్వం సాధించడానికి ఇంకా కొంత సమయం పడుతుంది. ఇప్పటికే అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రభావం చూపిస్తున్నారు. కానీ వారి సంఖ్య స్వల్పమే. కొన్నాళ్లలో మరింత మెరుగ్గా మహిళలు దూసుకొచ్చే అవకాశం ఉంది. వ్యవసాయ పనులన్నింటిలోనూ రాణిస్తూ ఎటువంటి బెరుకు లేకుండా గ్రామాల్లో మహిళలు పనులు చేస్తుండటం గమనార్హం.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి: వామపక్షాలు

ప్రజాశక్తి - పిచ్చాటూరు, యంత్రాంగం

ప్రకాశం- నెల్లూరు -చిత్తూరు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులైన మీగడ వెంకటేశ్వర్ రెడ్డి, పి.బాబు రెడ్డిలను గెలిపించాలని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం పిచ్చాటూరులో వామపక్షాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు, పి.మురళి మాట్లాడుతూ ఉద్యోగుల, కార్మికుల, కష్టజీవుల సమస్యలపై పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు నిరంతరం పోరాడారని అన్నారు. గతంలో మూడుసార్లు పిడిఎఫ్ అభ్యర్థులను పట్టభద్రులు, ఉద్యోగులు, కార్మిక సంఘాలు, మేధావులు గెలిపించారని గుర్తుచేశారు. మార్చి 13వ తేదీ జరగనున్న ఎన్నికలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కార్మిక వర్గానికి, ఉద్యోగులకు, మేధావులకు, వామపక్ష పార్టీలకు సంబంధించిన అన్ని కార్మిక సంఘాలకు, ప్రజా సంఘాలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి జనార్ధన్, సుభాష్‌కుమార్, జగన్నాథం, అన్నదొరై, రామచంద్రారెడ్డి, మురగేష్, నాగరాజు పాల్గొన్నారు. పుత్తూరు అంబేద్కర్ భవన్‌లోనూ వామపక్షాల ఆధ్వర్యంలో ప్రచారం జరిగింది. ఈ కార్యక్రమంలో మహేష్, వెంకటేష్, రవి, సెల్వరాజ్, జగన్, చంద్రబాబు, భాస్కర్, కృష్ణారెడ్డి, కెఆర్ సుబ్రమణ్యం, వై.ందయ్య, నరసింహులు, విజయ్, శివ, పురుషోత్తం పాల్గొన్నారు. రేణిగుంటలో సిఐటియు, ఎఐటియుసి, మహిళాసంఘం, గిరిజనసంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ స్కూళ్లలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చలపతి, మోహన్‌రెడ్డి, తులసిరాజన్, వెంకటరమణ, ఎంపిటిసి రాజేశ్వరి, ఈశ్వరమ్మ, కుప్పస్వామి పాల్గొన్నారు. గూడూరులో జనార్ధన్‌రెడ్డి కాలనీ, బాయ్స్, గర్ల్స్ హైస్కూల్, శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూలు, చర్చి కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. నాయకులు జోగి శివకుమార్, టి.వెంకటరామిరెడ్డి, అడపాల ప్రసాద్, ఎస్.సురేష్, పి.మణి, సిహెచ్ ప్రభాకర్, ఎస్‌కె కాలేషా, ఎంబేటి చంద్రయ్య, శశి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పై సమావేశంలో ప్రసంగిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి నాగరాజు

12న పోలింగ్ మెటీరియల్ పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి జిల్లాలో నాలుగు డివిజన్‌లకు సంబంధించి డివిజన్ కేంద్రాలలో పోలింగ్ మెటీరియల్ తరలింపుకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశామని, ఈ నెల 12న పి.ఓ., ఎ.పి.ఓ. లకు చెక్ లిస్టు మేరకు జాగ్రత్తగా పంపిణీ జరగాలని కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి అన్నారు. సోమవారం మధ్యాహ్నం శ్రీ పద్మావతీ డిగ్రీ కళాశాల పిజి బ్లాక్ లో ఏర్పాటు చేస్తున్న తిరుపతి డివిజన్ డిస్ట్రిబ్యూషన్ , రిసెప్షన్ సెంటర్‌నుకలెక్టర్, నగరపాలక కమీషనర్ అనుపమ అంజలి, ఆర్‌డిఓ కనకనరసా రెడ్డి మరోసారి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పి.ఓ. లు, ఎ.పి.ఓ. లు పోలింగ్ కేంద్రాల విధులు అందుకున్న వారు తప్పనిసరిగా ఈ నెల 12 న ఉదయం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద పోలింగ్ కు సంబందించిన మార్క్ డ్ ఓటర్ లిస్టు, పోలింగ్ బాక్సులు , బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ ఇతర సామగ్రిని ఒకటికి రెండుసార్లు పరిశీలించి సరిచూసుకుని తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఓటరు స్లిప్‌ల పంపిణీ 50 శాతం మేరకు జరిగిందని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తిరుపతి డివిజన్‌కు సంబంధించి పట్టభద్రుల నియోజకవర్గ పోలింగ్ కేంద్రాలు 29, ఓటర్లు 37,899, ఉపాధ్యాయ నియోజకవర్గ పోలింగ్ కేంద్రాలు 12, ఓటర్లు 3083 గా ఉన్నారని అన్నారు. అర్బన్ తహశీల్దార్, ఎ.ఈ.ఆర్.ఓ. వెంకటరమణ, నగరపాలక డిప్యూటి కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి , మునిసిపల్ ఇంజనీర్లు ఎలక్షన్ డి.టి. జీవన్ , ఏ ఎస్ ఓ మధు, డీటీలు రామచంద్ర , జానీ తదితరులు పాల్గొన్నారు.

జాబితాలపై అభ్యంతరాలుంటే తెలపండి

తిరుపతి టౌన్ : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో గ్రామ పంచాయితీ ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా అందుబాటులో ఉంచామని, అభ్యంతరాలను సదరు మండల అభివద్ధి అధికారి ,ఇ.ఓ.పి.ఆర్.డికి రాతపూర్వకంగా తెలియజేయాలని, వాటిపై ఈ నెల 9న విచారణ చేపట్టి , 10 న తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం వివిధ ఆకస్మిక కారణాల వల్ల ఖాళీ గా ఉన్న 41 వార్డు మెంబర్లు, 5 సర్పంచ్ ల ఎన్నిక నిమిత్తం ముసాయిదా పోలింగ్ జాబితా ప్రకటించడం జరిగిందని అభ్యంతరాలు ఈ నెల 7 లోపు తెలియజేయాలని, 9 న పరిశీలన చేపట్టి, 10 న తుది జాబితా ప్రకటించాలని ఆం.ప్ర ఎన్నికల సంఘం అధికారి నీలం సహాని షెడ్యూల్ విడుదల చేసారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

కాంట్రాక్టర్‌కు కోపమొచ్చింది..!

● సచివాలయం ఎదుట నిరసన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వేతనాలు ఇవ్వలేదని, కూలి డబ్బులు రాలేదనే డిమాండ్లతో నిరసనలు చూశాం.. తమను పర్మినెంట్ చేయాలనే ఆందోళనలూ చూశాం. అయితే కాంట్రాక్టర్లకూ కోపమొస్తోంది.. అప్పులు తెచ్చి, నెలల తరబడి వడ్డీలు కట్టలేక, అంతో ఇంతో మిగులుతుందని ఆశించి భంగపడుతున్న కాంట్రాక్టర్లు భంగపడి రోడ్లపైకి వస్తున్నారు. వినూత్నంగా నిరసన తెలియజేసి తమ బాధను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సాహసిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన విషయం విదితమే. అద్దె భవనాల్లోకాకుండా శాశ్వత భవనాలు త్వరితగతిన నిర్మించాలని వారం వారం కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో తిరుపతి రూరల్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ సచివాలయాల శాశ్వత భవన నిర్మాణానికి ముందుకొచ్చాడు. పెట్టుబడులు సొంతంగా పెట్టాడు. తిరుపతి రూరల్‌కు చెందిన శ్రీనివాసరావు అవిలాల, లింగేశ్వర్‌నగర్ సచివాలయాలను, లైబ్రరీలను రూ.70 లక్షలు పెట్టుబడి పెట్టి నిర్మించాడు. మొదటి బిల్లు రూ.20 లక్షలు వచ్చింది. చేసిన పనులకు ఇంకా 30 లక్షలు రావాల్సి ఉంది. పది నెలలుగా చేసిన బిల్లులు రాకపోవడంతో పంచాయతీ కార్యాలయ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాడు. అయితే వారినుంచి సరైన స్పందన లేకపోవడంతో 'ప్రభుత్వ పాలసీ అని, ప్రభుత్వం ఎపుడు విడుదల చేస్తే అపుడే వస్తుంది' అని చెప్పారు. అధిక వడ్డీలకు తెచ్చి కట్టడం వల్ల తమకు నష్టం తప్ప లాభం ఏంటి అరిచాడు. తమ చేతుల్లో ఏమీ లేదని, ప్రభుత్వం చేతిలో ఉందని అధికారులు చెప్పడంతో సోమవారం అవిలాల సచివాలయానికి, లైబ్రరీ భవనాలకు తాళాలు వేశారు. పంచాయతీ కార్యదర్శులు ప్రశ్నించడంతో తనకు బిల్లులు రాలేదని, తాళం వేసి ప్రభుత్వానికి నిరసన తెలుపుతున్నానని చెప్పాడు. అధికారులు బుజ్జగించడంతో ఉదయం 11 గంటలకు బీగాలు తీశాడు. ఇది తన ఒక్కడి సమస్యే కాదని, కాంట్రాక్టర్లు అందరూ ఈ విధంగానే ఇబ్బంది పడుతున్నారని 'ప్రజాశక్తి'కి కాంట్రాక్టర్ తెలిపాడు.

తిరుపతిలో దొంగ ఓట్ల జాతర

● నగరంలో 15వేలకు పైనే దొంగోట్లు ● ప్రజాస్వామ్య విలువలకు వైసిపి తిలోదకాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మార్చి 13న జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికలలో గెలవటానికి అధికార పార్టీ నేతలు అడ్డదారులలో ప్రయత్నాలు సాగిస్తున్నారని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి తీవ్రంగా విమర్శించారు. సిఐటియు కార్యకర్తల సర్వేలో విస్మయం గొలిపే విషయాలు బయటపడుతున్నాయన్నారు. సోమవారం ఉదయం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా నేత ఎన్ డి రవి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యంతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా తిలోదకాలిచ్చి వైసిపి నేతలు బరితెగించి తప్పులకు పాల్పడుతున్నారని అన్నారు. తిరుపతి నగరంలో విచ్చలవిడిగా దొంగ ఓట్లను నమోదు చేయించారని విమర్శించారు. స్థానిక యశోదానగర్‌లో ఓ ఖాళీస్థలంలో 10 ఓట్లు నమోదు చేశారని, పోలింగ్ బూత్ నెంబర్ 222లో ఇది బయటపడిందని తెలిపారు. పోలింగ్ బూత్ నెం. 223 రాఘవేంద్ర నగర్‌లో ఇంటి నెం: 7/18లో ఇంటి యజమానికి తెలియకుండానే 20 ఓట్లు నమోదు చేశారన్నారు. ఓటర్లు ఎవరో కూడా ఇక్కడి వారికి తెలియదని ఆరోపించారు. పోలింగ్ బూత్ నెం: 228 కొత్తపల్లిలో పూర్తిగా చదువులేని వారిని, ఆటో డ్రైవర్లుగా ఒకే స్టాండులో పని చేస్తున్న 61 మందిని ఓటర్లుగా నమోదు చేశారని చెప్పారు. నెహ్రూనగర్ లోని డోర్ నెం.4-4-562లో 36 మంది ఓటర్లు నమోదై ఉన్నారు. ఇది వైసిపీ వార్డు కార్యాలయమని వివరించారు. పోలింగ్ బూత్ నెం:229 అనంతవీధిలో ఒక అపార్ట్మెంట్ లో 50 దొంగ ఓట్లు నమోదై ఉన్నాయని తెలిపారు. పోలింగ్ బూత్ నెం:223 చింతలచేనులో చదువులేని 22 మందిని ఓటర్లుగా నమోదు చేశారని వివరించారు. ఎంఎల్‌సి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి సాక్ష్యాలతో కూడిన ఫిర్యాదులను అందించామని, దొంగ ఓట్ల గురించి పదే పదే మొత్తుకున్నా, ఫిర్యాదులు చేసినా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు ప్రవర్తించిందన్నారు. తిరుపతిలో 10-15వేలకు పైగా దొంగోట్లు చేర్పించినట్లు తమ సర్వేలో వెల్లడయ్యిందన్నారు. వీటిని తేల్చేందుకు ఓ సీనియర్ ఐఎఎస్ అధికారి నేతృత్వంలో పరిశీలనా యంత్రాంగాన్ని నియమించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు టి.సుబ్రమణ్యం, మునిరాజ, బుజ్జి, ఎన్‌డి శ్రీనివాసులు, పి.సాయిలక్ష్మి, హేమలత, శివ, బాల, రమేష్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో కందారపు మురళి

గంజాయి మూలాలను నాశనం చేయాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - తిరుపతి సిటి :

జిల్లాలో ఎక్కడా గంజాయి అనే పదం వినబడకూడదని, సమస్యాత్మక ప్రాంతాల్లో మూర్ఖంగా ముందుకు వెళ్లొద్దని, సమయస్ఫూర్తితో కార్యాచరణతో ముందుకు వెళ్లాలని ఎస్‌పి పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. కేసులు పెట్టడమే కాకుండా, మూలాలలను నాశనం చేయాలన్నారు. సోమవారం సెబ్ అధికారులతో పోలీసు అతిథిగృహంలో సమీక్ష జరిగింది. సెబ్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, ఎక్సైజ్ సూపరింటెండెంట్ డాక్టర్ స్వాతి పాల్గొన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి సత్ప్రవర్తన లేకుండా మరలా మరలా కేసుల్లో ఉంటే పీడీ యాక్ట్‌నూ ఉపయోగించాలన్నారు. తిరుమల పవిత్రతను కాపాడాలన్నారు.

మహిళలకు వైద్యశిబిరం

పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉన్నపుడే విధులు సక్రమంగా నిర్వహించగడలరని, అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సోమవారం నుంచి వారం రోజుల పాటు మహిళలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని ఎస్‌పి పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. పోలీసు పరేడ్ మైదానంలో పోలీసు కుటుంబ సభ్యులకు, మహిళా పోలీసు సిబ్బందికి, వివిధ రకాల క్యాన్సర్ వ్యాధిపై అవగాహనతో పాటు దంత వైద్యంపైనా ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి సతీమణి సాయిప్రసన్న, అడ్మిన్ సతీమణి పుష్పకీర్తి, అడిషనల్ ఎస్‌పిలు క్రైం విమలకుమారి, అడ్మిన్‌వెంకటరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులు స్పెషల్‌డ్రైవ్

ఎస్‌పి ఆదేశాల మేరకు తిరుపతి ట్రాఫిక్ డిఎస్‌పిలు కాటమరాజు, విజయ్‌శేఖర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. మోటార్ వాహనాల చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. 31 మంది ట్రిపుల్‌రైడింగ్, 9 మంది మైనర్లు, 12 మంది నంబర్‌ప్లేట్ లేని వాహనాలు నడిపిన 52 మందిని గుర్తించి, జరిమానా విధించినట్లు తెలిపారు.

అమర ఆసుపత్రిలో ప్రత్యేక హెల్త్ ప్యాకేజీ ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: తిరుపతిలోని అమర హాస్పిటల్ వారు ప్రపంచ మూత్రపిండ (కిడ్నీ) దినోత్సవం సందర్భంగా ప్రత్యేక హెల్త్ ప్యాకేజీలను ప్రారంభించారు. ఇందులో మూడు రకాల హెల్త్ ప్యాకేజీలను ఇచ్చారు. డయాబెటిక్ కిడ్నీ హెల్త్ ప్యాకేజ్ దీనిలో ఎఫ్ బి ఎస్, సి బి సి, ఆర్ ఎఫ్ టి, సి యు ఈ, యు యు ఎస్ జి అబ్డోమెన్, ఈ సి జి, 2డి ఎకో, బి. ఎమ్.ఐ, ఈ.జి.ఎఫ్.ఆర్. అసెస్మెంట్, నెఫ్రాలజిస్ట్ కన్సల్టేషన్ ఇవి అన్ని కూడా కేవలం 900 రూపాయలకు అందిస్తున్నారు అంతేకాకుండా దయా లసిస్ పేషెంట్స్ లకు కూడా ప్రత్యేకమైన పరీక్షలు ప్యాకేజీ రూపంలో 900రూపాయలకు అందిస్తున్నారు కావున ప్రతి ఒక్కరూ తమ యొక్క ఆరోగ్యాన్ని ఆనందంగా ఉండేవిధంగా చూసుకోవాలని అమర హాస్పిటల్ వైద్యులు మరియు సిఏఓ వేణుగోపాల్ తెలిపారు.

నేటినుంచి ఎస్వీయూలో 'న్యాక్ పీర్' కమిటీ సందర్శన

ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీసీ కె.రాజారెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాన్ని ఛైర్మన్, ఏడుగురు సభ్యులతో కూడిన న్యాక్ పీర్ కమిటీ మార్చి 7-9 తేదీల్లో సందర్శించనుందని విసి ఆచార్య కె రాజారెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎస్వీయూ మూడు సార్లు న్యాక్ పరిశీలనకు వెళ్లి మంచి గ్రేడ్లు సాధించిందని , గడిచిన 2017 సంవత్సరంలో ఏ ప్లస్ సాధించిందని, ఐదేళ్ల తర్వాత మరలా నియమానుసారం మంగళవారం నుంచి న్యాక్ బంద పరిశీలన జరుగుతుందన్నారు. బోధన , పరిశోధన , అవస్థాపన సౌకర్యాలు , సామాజిక బాధ్యత , ఉద్యోగ పరికల్పన, ఉత్తమ ఫలితాలు వంటి అంశాల్లో ఎస్వీయూ మంచి ర్యాంకులను సాధించిందని , వాటి ప్రతిఫలాలు న్యాక్ ఉత్తమ గ్రేడ్ సాధించే దిశగా విశ్వవిద్యాలయం అడుగులు వేస్తుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ఎస్వీయూలో 54 శాఖలు , 88 కోర్సులు నడుస్తున్నాయని, పర్స్ సెంటర్ , సీమన్స్ ల్యాబ్, ప్రాచ్యపరిశోధన సంస్థ వంటివి గొప్ప శోధన కేంద్రాలని, హెల్త్ సెంటర్, గెస్ట్ హౌస్ ,వంటి సౌకర్యాలు యస్వీయూ సొంతమని , ఇవన్నీ న్యాక్ కమిటీ గుర్తిస్తుందని అన్నారు. విశ్వవిద్యాలయం హెచ్ ఇండెక్స్ , స్కోపస్ వంటి పరిశోధన సూచీలలో రాష్ట్రంలో ముందు వరుసలో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఎస్వీయూ న్యాక్ డైరెక్టర్ ఆచార్య శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఏడు పాయింట్ల క్రైటీరియాతో 70వేల పుటలతో యస్ యస్ ఆర్2022 సెప్టెంబర్ లో పంపడం జరిగిందని , తేదీలు న్యాక్ కేంద్రకార్యాలయం ఇటీవల ఇవ్వడంజరిగిందని, నూతన విద్యావిధానం 2020 ని రాష్ట్రంలో ఎస్వీయూ మొదట అమలు చేయడం న్యాక్ పరిశీలనకు కలసి వస్తుందని, సోలార్ ఫవర్ , స్మార్ట్ బోర్డ్ టీచింగ్ వంటి వీటిలో ఎస్వీయూ ఆధునికంగా వుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆచార్యులు దామోదర రెడ్డి, రత్నాకర్ , కుసుమహరినాథ్ , వైవి రామిరెడ్డి, పిసి వెంకటేశ్వర్లు, జే ఆర్ చంద్రయ్య, డాక్టర్ ఫణి రమేష్, న్యాక్ కార్యాలయ సిబ్బంది జగదీష్ పాల్గొన్నారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ : జేఈవో

ప్రజాశక్తి - తిరుపతి సిటి: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మార్చి 31 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో వివిధ విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని టిటిడి జెఈవో వీరబ్రహ్మం విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. టిటిడి పరిపాలన భవనంలో సోమవారం ఆయన ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెఈవో మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీన శ్రీ కోదండరామస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు ప్రారంభించాలన్నారు. కల్యాణానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వైఎస్ఆర్ జిల్లా అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుని టిటిడిలోని అన్ని విభాగాల అధికారులు సమర్థవంతంగా పని చేయాలన్నారు. భక్తుల సంఖ్యకు సరిపడా తాగునీరు, మజ్జిగ పంపిణీకి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. బహ్మోత్సవాల పోస్టర్లు, బుక్‌లెట్లు త్వరగా ముద్రించి విస్తతంగా ప్రచారం చేయాలని చెప్పారు. ఈ సమీక్షలో ఎస్వీబీసీ సిఈవో షణ్ముఖ్ కుమార్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, సిపివో శేషశ్శైలేంద్ర, ఆలయ డెప్యూటీ ఈవో నటేష్ బాబు, డిఎఫ్‌వో శ్రీనివాస్, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ప్రమాణాలు ఆరోగ్య కేంద్రాల్లో అమలు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలోని అన్ని ప్రజారోగ్య ఆసుపత్రులలో సుస్థిరమైన అధిక నాణ్యతతో కూడిన ఆరోగ్య సంరక్షణ, మెరుగైన వైద్యం అందించడమే ప్రాథమిక లక్ష్యంగా సేవలు అందించాలని కలెక్టర్, జిల్లా స్థాయి నాణ్యత హామీ కమిటీ చైర్మన్ కె వెంకట రమణ రెడ్డి అన్నారు.సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వైద్య శాఖ ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి నాణ్యత హామీ కమిటీ తొలి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సంబంధిత కమిటీ సభ్యులైన డిప్యూటి డిఎంహెచ్ఓ, డి సి హెచ్ ఎస్ ఏరియా ఆసుపత్రి, సూపరింటెండెంట్ రుయా ఆసుపత్రి, జిల్లా ప్రసూతి ఆస్పత్రి తదితర వైద్య అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ముందుగా జిల్లా నాణ్యత అధికారి హరికష్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిటీ బాధ్యతలు మార్గదర్శకాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా వైద్య సేవల రాష్ట్ర నాణ్యత హామీ కమిటీ, జిల్లా స్థాయిలో జిల్లా నాణ్యత హామీ కమిటీ ఏర్పాటుతో అన్ని ఆసుపత్రులలో పేదలకు వారి సంతప్తి మేరకు నాణ్యతతో కూడిన వైద్య సేవలు అందించే మహోన్నత లక్ష్య సాధన దిశలో జిల్లా రుయా హాస్పిటల్, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, 2 ఏరియా ఆసుపత్రుల్లో, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు 10, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 58, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 25, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లు 438 మొత్తం వెరసి జిల్లాలోని 535 ఆరోగ్య కేంద్రాలలో వైద్య అధికారులు పని చేయాలని సూచించారు. జిల్లాలోని 58 పి హెచ్ సి లలో 24 సర్టిఫికెట్ పొందాయని, ఏరియా ఆసుపత్రి శ్రీకాళహస్తి, సి హెచ్ సి పుత్తూరు, చంద్రగిరి సదరు సర్టిఫికెట్ పొందాయని తెలిపారు. సమావేశ అనంతరం సర్టిఫికేషన్ పొందిన కుప్పంబాదూరు, పిచ్చాటూరు, జి జే పల్లి, కేవీబీ పురం తదితర పి హెచ్ సి ల వైద్యాధికారు లకు ధవీకరణ పత్రాలు కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సమావేశంలో రుయా ఆసుపత్రి, జిల్లా ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ లు నాగ మునీంద్రుడు, పార్థసారథి, డిప్యూటి డిఎంహెచ్ఓ అరుణ సులోచన దేవి , డి సి హెచ్ ఎస్ డా.ప్రభావతమ్మ, గూడూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకష్ణ , డిప్యూటీ డిఎంహెచ్వో సుధారాణి, జిల్లా ఇమునైజేషన్ అధికారిని శాంత కుమారి, నాణ్యత పర్యవేక్షణ కన్సల్టెంట్ శ్రావ్య తదితర వైద్యాధికారులు పాల్గొన్నారు.



పురస్కారాన్ని అందుకుంటున్న పిచ్చాటూరు డాక్టర్

పిచ్చాటూరు పీహెచ్‌సీకి జాతీయ స్థాయి గుర్తింపు

ప్రజాశక్తి- పిచ్చాటూరు: పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించినట్లు వైద్యాధికారి డాక్టర్ గాయత్రి తెలిపారు. సోమవారం తిరుపతిలో పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కలెక్టర్ వెంకటరమణ రెడ్డి చేతుల మీదుగా ఎన్.క్యు.ఏ.ఎస్ సర్టిఫికేష్ (నేషనల్ క్వాలిటీ అష్యురెన్స్ సర్టిఫికేషన్) ప్రదానం చేశారు. ఈ సర్టిఫికేషన్‌ను పీ హెచ్ సీ వైద్యాధికారి డాక్టర్ గాయత్రి అందుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి (పీ హెచ్ సీ)లలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం, మెరుగైన వైద్యం అందించడం, ఆసుపత్రికి వచ్చే రోగులతో వైద్యులు, సిబ్బంది నడుచుకునే విధానం వంటి అంశాలపై కేంద్ర బందం పీ హెచ్ సీ లను పరిశీలించింది. ఈ పరిశీలన అనంతరం కేంద్ర వైద్య ఆరోగ్య శాఖకు బందం నివేదిక సమర్పించింది. ఈ నివేదిక మేరకు పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గుర్తించి నేషనల్ క్వాలిటీ అష్యురెన్స్ సర్టిఫికేషన్ కు ఎంపిక చేసింది. ఈ మేరకు సోమవారం తిరుపతిలో జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి చేతుల మీదుగా పిచ్చాటూరు పీ హెచ్ సీ వైద్యాధికారి గాయత్రికి అందించారు. పీ హెచ్ సీ కి జాతీయ స్థాయి గుర్తింపు రావడం పట్ల రెండవ వైద్యాధికారి హమీద్, మండల వైద్య ఉద్యోగులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

పసుపులేటికి 'గ్రామీణ విద్యావారధి' బిరుదు

ప్రజాశక్తి-కోట : కోట పట్టణానికి చెందిన పసుపులేటి కిషోర్ చిన్ననాటి నుంచి కష్టపడి చదివి ఉన్నత విద్యావంతులుగా రాణించి పుట్టిన ఊరులోనే ప్రగతి విద్యాసంస్థలు స్థాపించి ఎంతో మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను అందిస్తున్నారు. ఆయన సతీమణి డాక్టర్ కావడంతో కోట ప్రాంత ప్రజల కోసం ప్రగతి హాస్పిటల్ స్థాపించి ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. అనతి కాలంలోనే ప్రగతి విద్యాసంస్థలకు మంచి పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ప్రగతి విద్యాసంస్థల ఛైర్మన్ పసుపులేటి కిషోర్ సేవలకు గ్రామీణ విద్యావారధి బిరుదును వి.రామన్ అకాడమి సేవా సాంస్కృతిక సంస్థ ప్రకటించింది. ఆదివారం సికింద్రాబాద్ హరి హర కళాభవన్‌లో సర్ సి. వి. రామన్ అకాడమి సేవా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో సినీ హీరోలు సాయికిరణ్, సుమన్ చేతుల మీదుగా 'గ్రామీణ విద్యా వారధి ' బిరుదు ను ప్రగతి విద్యా సంస్థల ఛైర్మన్ పసుపులేటి కిషోర్ అందుకున్నారు. తమ విద్యాసంస్థల సేవలను గుర్తించి బిరుదును అందించారని తెలిపారు.

15న ఎన్‌బీకేఆర్ఐఎస్టీలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి-కోట: మండలంలోని విద్యానగర్ ఎన్.బి.కె.ఆర్.ఐ.ఎస్.టిలో ఈ నెల 15వ తేదీన సీఎస్ విభాగం ఆధ్వర్యంలో టెక్వ్యూహ-2023 జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతి డా.ఎ.రాజశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం కళాశాల ప్రాంగణంలో సదస్సుకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. దేశంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ పరిశోధనలను ఇక్కడ ఆవిష్కరించనున్నారు. ప్రోగ్రాం కన్వీనర్ సీహెచ్.విష్ణువర్ధన్ రెడ్డి, స్టూడెంట్ కోఆర్డినేటర్లు పి.జశ్వంత్, టి.వి.సాయి, జి.లక్ష్మి ప్రియ, తేజస్విని, కె.హేమ, తనుశ్రీ, సంధ్య పాల్గొన్నారు.

రాకేష్‌రెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు చిరంజీవిరెడ్డిలను సోమవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఉదయం పుత్తూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏఐసీసీ మెంబర్ భానుమూర్తి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాబు, డీసీసీ సెక్రెటరీ దేశయ్య, పురుషోత్తంరెడ్డి, లోహితరాజు, సుధాకర్, దేశప్ప, కార్తీక్, తిలక్, శివ, దివాకర్, గుణ, వెంకటేష్, ఆదిశివ, శిఖామణి, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి పారిశ్రామిక వేత్తల పెట్టుబడులు

ప్రజాశక్తి-క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టేందుకు దేశంలోనే అత్యంత సంపన్నులైన పారిశ్రామిక వేత్తలు ముందుకు రావడం సువర్ణ అధ్యాయమని వైఎస్‌ఆర్‌టియుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ రాజారెడ్డి తెలిపారు. సీయంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పగ్గాలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చారని తెలిపారు. రూ.13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రావడంతో రాష్ట్రం మరింత అభివద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు రాష్ట్రంలో ఏదో జరిగిపోతుందని మరో శ్రీలంక, బీహార్‌లా అవుతుందని విమర్శలు చేసిన వారికి గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ ఒక చెంపపెట్టులాంటిదని తెలిపారు. టీడీపీ నేత చంద్రబాబునాయుడు నుంచి ఏ ఒక్కరూ నోరు మెదపలేని విధంగా రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. గతంలో చంద్రబాబునాయుడు రాష్ట్రానికి తీసుకొచ్చిన పెట్టుబడులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు.

నవదంపతులకు పట్టువస్త్రాలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: కైలాసపురం గ్రామానికి చెందిన బాబునాయుడు మోహనకృష్ణ, రూపికల వివాహానికి యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌ను కలిసి పెళ్లి పత్రిక అందించారు. దీంతో లోకేష్ కొత్తగా పెళ్లయిన వధూవరులు మోహన కష్ణ, రూపికలకు పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలు పుత్తూరు టీడీపీ కార్యాలయానికి పంపారు. సోమవారం పుత్తూరు రూరల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.రవికుమార్, బాలాజీ నూతన వధూవరులకు సమర్పించి వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ జయచంద్రనాయుడు పాల్గొన్నారు.

రజక కుటుంబానికి న్యాయం చేయండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తొట్టంబేడు మండలం శివనాథపురానికి చెందిన రజక మహిళ మునిరాజమ్మపై దాడి చేసి ఆమె జీవనాధారమైన తోపుడు బండిని ధ్వంసం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం (ఏపీఆర్వీఎస్) తిరుపతి జిల్లా కమిటీ అధ్యక్షులు నిమ్మనపల్లి మునిరత్నం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సోమవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో రజక వత్తిదారులపై దాడులు, దౌర్జన్యాలు, లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముని రాజమ్మ పై దాడి చేసి తిరిగి ఆమెపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును బనాయించడం రజక వత్తిదారులపై జరుగుతున్న దాడులకు నిదర్శనంగా చెప్పుకోవచ్చున్నారు. న్యాయం చేయాలని లేనిపక్షంలో దశల వారి ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చూడతామని హెచ్చరించారు. సంఘం గౌరవ సలహాదారు గండికోట ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి జోరేపల్లి దిలీప్ కుమార్, కోశాధికారి ఎం. రాధాకష్ణ, మహిళా నాయకురాలు జయంతి, ఇ. అమ్ములు, తాళ్లూరు పద్మనాభ, గండికోట నాగరాజు పాల్గొన్నారు.

తపాలా బీమా.. కుటుంబానికి ధీమా

- రూ.399 లకే రూ.10 లక్షల వరకు ప్రయోజనం
- ఖాతాదారులకు మాత్రమే అవకాశం
- పాలసీ పొందిన రోజు రాత్రి 12 నుంచే వర్తింపు
- 18-65 ఏళ్ల మధ్య వయస్సుల వారు అర్హులు
- గ్రామీణులకు అందుబాటులోనే సేవలు

గ్రామీణ ఖాతాదారుల సంక్షేమం కోసం తపాలా శాఖ సరికొత్త బీమా పాలసీని తీసుకొచ్చింది. ఏడాదికి రూ.399 ప్రీమియం చెల్లిస్తే రూ.10 లక్షల ప్రమాద బీమా వర్తింపజేస్తోంది. ప్రీమియం చెల్లించిన రాత్రి 12 గంటల నుంచి ఏడాదిలోపు ప్రమాదంలో మరణించినా.. శాశ్వత, పాక్షిక అంగ వైకల్యం కలిగినా, పక్షవాతం సంభవించినా బీమా అందజేస్తుంది. అలాగే అర్హులైన వారికి ఆసుపత్రిలో వైద్య ఖర్చులకు రూ.30 వేల వరకు చెల్లిస్తుంది. ఇందుకు 18 నుంచి 65 ఏళ్లలోపు ఉన్న ఖాతాదారులు మాత్రమే అర్హులు.

ప్రజాశక్తి - పిచ్చాటూరు

తపాలాశాఖ టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ సంస్థ సౌజన్యంతో పేద, బడుగు, బలహీన వర్గాలకు అందుబాటులో ఉండేలా గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీని రూ.399 ప్రీమియంతోనే అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పాలసీలో ఎలాంటి ప్రమాదం సంభవించినా బీమా తీసుకున్నప్పటి నుంచి ఏడాది పాటు రూ.10 లక్షల బీమా కవరేజ్ వర్తిస్తుంది. యాక్సిడెంటల్ బీమా పాలసీ 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారికి మాత్రమే వర్తిస్తుంది. ఈ పాలసీని గత ఏడాది ఏప్రిల్ నెలలో ప్రవేశపెట్టింది. ఇప్పటికే తిరుపతిలో జిల్లాలో మాత్రమే సుమారు 3 వేల మంది వరకు పాలసీని తీసుకున్నారు.

బీమా పొందడం ఇలా..!

ఈ పాలసీ పొందాలంటే ముందుగా పోస్టల్ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలి. ఖాతా లేనివారు రూ.200 లతో నూతనంగా ఖాతా తెరవాలి. బీమా పాలసీకి రూ.399 నగదు చెల్లించి పొందవచ్చు. ప్రమాదం సంభవించినప్పుడు మాత్రమే ఈ బీమా వర్తిస్తుంది. దీర్ఘకాలిక పక్షవాతం ఉన్న వారికి బీమా వర్తించదు. బీమా చేసుకున్న తర్వాత ప్రమాదం సంభవించినా, పక్షవాతం వచ్చినా బీమా వర్తిస్తుంది. పాలసీ కోసం నగదు చెల్లించిన రోజు అర్ధరాత్రి 12 గంటల నుంచే బీమా రక్షణ ప్రారంభమవుతుంది. పాలసీదారులకు బాండును వెంటనే అందిస్తారు.

పాలసీదారులకు ప్రయోజనాలు ఇలా..!

- ప్రమాదవశాత్తు మృతిచెందినట్లయితే రూ.10 లక్షల బీమా వర్తిస్తుంది.
- శాశ్వత వైకల్యం కలిగితే వారికి రూ.10 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.10లక్షలు వర్తిస్తుంది.
- పక్షవాతం సంభవిస్తే రూ.10 లక్షలు
- విద్యా ప్రయోజనం పది శాతం (గరిష్టంగా అర్హత ఉన్న ఇద్దరి పిల్లలకు) రూ.లక్ష, ఖర్చు ఏది తక్కువ ఉంటే అది వర్తిస్తుంది.
- ఆసుపత్రిలో పదిరోజుల వరకు ఉంటే రోజుకు రూ1000 చొప్పున అందిస్తారు.
- కుటుంబ రవాణా ప్రయోజనాలు రూ.25 వేలు, అంత్యక్రియలకు రూ.5 వేలు.
- యాక్సిడెంట్ మెడికల్ ఖర్చులు ఇన్‌పేషంట్లకు రూ.60 వేల వరకు అందిస్తుంది.
- ప్రమాదవశాత్తు వైద్య ఖర్చులకు ఔట్‌పేషంట్ డిపార్ట్‌మెంట్‌కు రూ.30 వేలు అందిస్తుంది.

తపాలా పాలసీని అందరికీ ఉపయోగకరం

తపాలా పాలసీని అందరికీ ఉపయోగకరంగా ఉంది. ఇప్పటికే జిల్లాలో సుమారు 3 వేల మందికి పైగా బీమా తీసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలందరూ బీమా పొందేలా ఈ పాలసీని తపాలాశాఖ రూపొందించింది. రూ.399 లను ఖాతాదారులు ఏడాదికి చెల్లిస్తే రూ.10 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది. చాలా మందికి పథకంపై అవగాహన లేదు. ప్రజల్లో ఈ పాలసీపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతికుటుంబం సద్వినియోగం చేసుకోవాలి.

- మణిగండన్, ఇన్‌స్పెక్టర్ పోస్ట్స్, శ్రీకాళహస్తి

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-సత్యవేడు: కార్మిక ఉద్యమం నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం పుట్టిందని..మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని సత్యవేడు సీఐ శివకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం అంతర్జాతీయ మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక బాలికల గురుకుల కళాశాలలో మహిళలకు చట్టపరంగా ఉన్న రక్షణ, వారి హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి రంగంలోనూ మహిళల భాగస్వామ్యం ప్రోత్సహించి వారి హక్కులపై అవగాహన కల్పించాలని.. ఇందుకోసమే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జరుపుకుంటున్నామన్నారు. మార్చి 8వ తేదీన జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి అధికారికంగా ప్రకటించినట్టు ఆయన తెలిపారు. మహిళలపై హింస లేని ప్రపంచాన్ని చూడాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు. లింగ సమానత్వాన్ని వేగవంతం చేయడంతోపాటు మరింత ఊపు అందుకునేలా చేయడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే మహిళా సాధికారతకు, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో వారికి పెద్దపీట వేయడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగానే చిన్నారులపై జరుగుతున్న లైంగిక వేధింపులు, వికత చేష్టలు వంటి వాటిని పూర్తిగా నిర్మూలించాలన్న ఉద్దేశంతో ఫోక్సో చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి కాకుండా ఆడపిల్లలు బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్టరీత్యా బాల్యవివాహాలు చేసుకోవడం నేరమన్నారు. ఎస్సై పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్ మహిళలకు ఉక్కు కవచమన్నారు. ఆపదలో చిక్కుకున్న మహిళలకు దిశ యాప్ అందుబాటులో ఉంటే నూటికి నూరు శాతం రక్షణ ఉంటుందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు ఎక్కడైనా ఎప్పుడైనా మొబైల్లో ఉన్న దిశా యాప్ ఎస్ఓఎల్ బటన్ నొక్కితే సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం అంది క్షణంలో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుంటారన్నారు. ప్రతి మహిళ వారి మొబైల్లో దిశ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపల్ ప్రసన్న, వైస్ ప్రిన్సిపల్ వసుంధర దేవి, సచివాలయ మహిళా పోలీసులు చంద్రకళ, సుకన్య, నిహారిక, ప్రత్యూష, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరామలో మహిళల ఆత్మరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడీ మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల మహిళ రక్షణ విభాగం, జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో సోమవారం మహిళ ఆత్మరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. తిరుపతి నవీన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి వారు కళాశాలలోని విద్యార్థినులకు విపత్కర పరిస్థితుల్లో ఎలా రక్షించుకోవాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. అకాడమీ శిక్షకులు బాలికలకు వివిధ రకాల మార్షల్స్ నేర్పించి, ఎదుటి వారి నుంచి ఎలా తప్పించుకోవాలి అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవిందుకుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.జయచంద్ర, కన్వీనర్ డాక్టర్ మునిశంకర్, చక్రిశ్రీధర్ విద్యార్థినులు పాల్గొన్నారు.

ముక్కంటి అన్నదానానికి విరాళం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి సూళ్లూరుపేటకు చెందిన కె.రఘురామయ్య అనే భక్తుడు సోమవారం రూ.50,016 విరాళంగా అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ఆ విరాళం స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలియచేసి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనరు మల్లిఖార్జున ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా బలిజ భవన్ పనులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నరసింహతీర్థం వద్ద బలిజ భవన్ పరిరక్షణ పనులు వేగంగా జరుగుతున్నాయని బలిజ జేఏసీ అధ్యక్షులు నీలం బాలాజీ, కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆదేశాల మేరకు నగరపాలక అధికారులు, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నీలం బాలాజీ మాట్లాడుతూ బలిజభవన్ పరిరక్షణ తిరుపతి బలిజల ఆకాంక్ష అని, త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. తరువాత కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ బలిజ ఐక్యత బలిజభవన్ తోనే సాధ్యమని, బలిజభవన్ నిర్మాణానికి ప్రతివ్యక్తి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బలిజ జేఏసీ నాయకులు ఆళ్వార్ మురళి, నంద గోపాల్, ద్వారకా, సురేష్, అనంత వీధి సత్య, దొరైరాజ్, సతీష్, ఎర్రంశెట్టి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు సత్రవాడ మునిరామయ్య తనయుడు సత్రవాడ ప్రవీణ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రాజెక్టు వీధికి చెందిన పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి సతీమణి బొజ్జల బందమ్మ వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రం అభివద్ధి చెందాలన్నా, శ్రీకాళహస్తి ప్రశాంతంగా ఉండాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలని బొజ్జల బందమ్మ అభిప్రాయపడ్డారు. పార్టీలో చేరిన వారిలో సాయికుమార్, కుమార్, ముని కుమార్, షబ్బీర్, వెంకటేష్, తిరుముల, ప్రేమ్, వినయ్, తెట్టు ముని, బాలాజీ, అర్ముగం, ముని, నాగరాజు, గంగయ్య తదితరులు ఉన్నారు.

శీవారి సేవలో మంచు మనోజ్ దంపతులు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారిని నూతన వధూవరులు మంచు మనోజ్, భూమా మౌనిక రెడ్డిలు దర్శించుకున్నారు. సోమవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. వారి వెంట తెలంగాణ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, మంచు లక్ష్మిలు స్వామివారిని దర్శించుకున్నారు. దర్శన అనంతరం మంచు మనోజ్ మీడియాతో మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలల్లో ఎన్నో వ్యతిరేకతలను చూసి పెళ్లి చేసుకొని కలిశామని, శివుడు ఆజ్ఞ వల్లే తమ వివాహం జరిగిందన్నారు. తనకు రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని, ప్రజా సేవ చెయ్యాలన్న కోరిక వుందన్నారు.

నేడు కుమారధార తీర్థ ముక్కోటి

ప్రజాశక్తి - తిరుమల: మార్చి 7న మంగళవారం తిరుమల శ్రీ కుమారధార తీర్థ ముక్కోటికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ విస్తత ఏర్పాట్లు చేసింది. భక్తులను ఉదయం 6 గంటల నుండి తీర్థానికి అనుమతిస్తారు. కుమారధార తీర్థం ముక్కోటికి వెళ్లే భక్తులకు డ్యాం వద్ద అన్నప్రసాదం, తాగు నీరు అందిస్తారు. వైద్య సదుపాయం ఏర్పాటు చేస్తారు. భక్తుల భద్రతను పర్యవేక్షించేందుకు కుమారధార తీర్థం వరకు దాదాపు 300 మంది విజిలెన్స్, పోలీస్, ఫారెస్ట్ సిబ్బంది కేటాయించారు. గుండె సంబంధిత వ్యాధులు, ఆస్తమా, స్థూలకాయం, రక్తపోటు ఉన్న భక్తులు, వద్ధులు ట్రెక్కింగ్ చేయ వద్దని మనవి. మధ్యాహ్నం 12 గంటల తర్వాత పాప వినాశనం నుండి కుమారధార తీర్థ ప్రవేశం మార్గం మూసివేయబడుతుంది. కావున భక్తులు ఈ సౌకర్యాలను ఉపయోగించుకుని తమ కుమారధార తీర్థ ముక్కోటి యాత్రను జయప్రదం చేయాలని టీటీడీ కోరుతోంది. టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి సోమవారం ఉదయం పిఎసి-4లో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. విజిఓలు బాలిరెడ్డి, గిరిధర్, తిరుమల డిఎస్‌పి వేణుగోపాల్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు.

9న శ్రీసత్య సాయి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈనెల 9వ తేదీ తిరుపతి నగర పరిధిలోని కేశవాయనిగుంటలోని శ్రీసత్య సాయి మందిరంలో భగవాన్ శ్రీసత్య సాయిబాబా విగ్రహం ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్ తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2011 తర్వాత ఆలయ అభివద్ధి కార్యక్రమాలు వేగవంతం చేస్తూ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి నగర ప్రజలతో పాటు నగర పరిసర ప్రాంతాలలోని సాయి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

డేవిడ్ రీస్‌లో ఉచిత వైద్యసేవలు



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఏర్పేడు మండలంలోనీ డేవిడ్ రీస్ ఆసుపత్రి లో ఉచిత వైద్య శిబిరాన్ని ఆసుపత్రి అడిషనల్ డైరెక్టర్ వై ప్రవీణ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఏర్పేడు, ఆమందూరు, బాలకష్ణాపురం, సీతారాంపేట, మేర్లపాక, నచ్చనేరి, నాగంపల్లి, దుగ్గపేరి, రాజులపాళ్యం, పరమాలపల్లి, ఆముదూరు, బిందెయపల్లి, కష్ణంపల్లి గ్రామాల నుంచి విచ్చేసిన దాదాపు 300 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో డాక్టర్ రజిని, డాక్టర్ ఆల్బర్ట్ మోజస్, డాక్టర్ సందీప్, డాక్టర్ జీవన్ తదితరులు వైద్య సేవలు అందించారు.

మంటల్లో లారీ దగ్ధం

ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట-కడప రోడ్డు మార్గంలో సోమవారం సాయంత్రం ఓ లారీ అగ్నికి ఆహుతైంది. స్థానికుల కథనం మేరకు.. కరకంబాడి నుంచి పేపర్ లోడ్డుతో కడప వైపు వెళుతున్న లారీలో ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. మంటలను గ్రహించిన లారీని రోడ్డు పక్కనే నిలిపేశారు. రేణిగుంట పోలీసులు సంఘటన స్థలం చేరుకొని మంటలు అదుపు చేశారు.

గల్లంతైన యువకుడి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: పాండూరు హైస్కూల్ సమీపంలోని వ్యవసాయ బావిలో ఆదివారం యువకుడు గల్లంతయ్యాడు. సోమవారం సైతం అగ్నిమాపక సిబ్బంది, ఎస్సై నాగార్జునరెడ్డి స్థానికులతో కలిసి మోటారు సహాయంతో నీటిని మొత్తం తోడి మతదేహాన్ని వెలికితీశారు. బాలాయపల్లి మండలం కడవగుంట గ్రామానికి చెందిన నాగరాజు(20) ఉద్యోగ రీత్యా చిన్నపాండూరు సమీపంలో నివాసం ఉంటూ ఆదివారం సరదాగా స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు బావి దగ్గరకు వెళ్లాడు. అయితే అక్కడ ఏమి జరిగిందో బావిలో గల్లంతై యువకుడు దుర్మరణం చెందారు. సహచర స్నేహితులను ఎస్ఐ విచారణ చేస్తున్నారు. కేసు నమోదు చేసి శవ పంచనామా నిమిత్తం మృత దేహాన్ని సత్యవేడు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్రేమ జంటపై కిడ్నాప్ కేసు

- వయస్సు ధ్రువీకరణ పత్రాలతో కథ సుఖాంతం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ప్రేమించి పెళ్లి చేసుకున్న ఒక ప్రేమ జంటపై కుటుంబ సభ్యులే కిడ్నాప్ కేసు పెట్టడంతో వారిని వయస్సు ధ్రువీకరణ పత్రాలు అడిగారు. ఎట్టకేలకు తహశీల్దారు స్పందించి వారికి పత్రాలు అందజేయడంతో పోలీసులు కిడ్నాప్ కేసును ఎత్తివేశారు. ఈ సంఘటన తిరుపతి రూరల్ లో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. తిరుపతి రూరల్‌కి చెందిన రెడ్డయ్య, తేజేస్వి గత కొంతకాలంగా ప్రేమించుకున్నారు. వీరు కులాలు వేరు కావడం తో ఇరువురు కుటుంబ సభ్యులు వీరి పెళ్లి కి నిరాకరించారు. పెద్దలను కాదని ఇరువురు ఇంటి నుంచి పారిపోయి ప్రేమ వివాహం చేసుకున్నారు. దీంతో అమ్మాయి కుటుంబ సభ్యులు తమ కూతురు మైనర్ అని.. కిడ్నాప్ చేశారని పోలీసులను ఫిర్యాదు చేశారు. పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. పోలీసులకు ఆ జంట మేజర్లు అని చెప్పడం తో వారిని వయస్సు ధ్రువీకరణ పత్రాలను కోరారు. దీంతో ఆ జంట తిరుపతి రూరల్ తహశీల్దారుకు రెండు రోజులు క్రితం అర్జీ పెట్టుకున్నారు. సోమవారానికీ ఆమె స్పందించికపోవడంతో కార్యాలయం ఎదుట ప్రేమజంటతోపాటు మిత్రులు ఆందోళనకు దిగారు. ఎట్టకేలకు స్పందించిన తహశీల్దారు సంబంధిత పత్రాలను అందజేయడంతో ఆందోళన విరమించారు. ఆ పత్రాలను పోలీసులుకు అందించి కిడ్నాప్ కేసు నుంచి బయట పడటంతో కేసు సుఖాంతం అయింది.

పోలింగ్ కేంద్రాల జాబితాలపై అభ్యంతరాలుంటే తెలపండి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో నేడు గ్రామ పంచాయితీ ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా అందుబాటులో ఉంచామని, అభ్య0తరాలను సదరు మండల అభివద్ధి అధికారి ,ఇ.ఓ.పి.ఆర్.డి వారికి వ్రాతపూర్వకంగా తెలియ జేయాలని, వాటిపై ఈ నెల 9 న విచారణ చేపట్టి , 10 న తుది పోలింగ్ కేంద్రాల జాబితాప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కె.వెంకటరమణా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో ప్రస్తుతం వివిధ ఆకస్మిక కారణాల వల్ల ఖాళీ గా ఉన్న 41 వార్డు మెంబర్లు, 5 సర్పంచ్ ల ఎన్నిక నిమిత్తం ముసాయిదా పోలింగ్ జాబితా ప్రకటించడం జరిగిందని అభ్యంతరాలు ఈ నెల 7 లోపు తెలియజేయాలని, 9 న పరిశీలన చేపట్టి, 10 న తుది జాబితా ప్రకటించాలని ఆం.ప్ర ఎన్నికల సంఘం అధికారి నీలం సహాని వారు షెడ్యూల్ విడుదల చేసారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలియ జేశారు.

కిడ్నీ రోగులకు అండగా నెఫ్రోప్లస్

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: స్థానిక ఏరియా ఆసుపత్రి పరిధిలో నిర్వహిస్తున్న నెఫ్రో ప్లస్ డయాలసిస్ సెంటర్ పేద కిడ్నీ రోగులకు అండగా నిలుస్తోంది. సుమారు ఏడేళ్లుగా ఇక్కడ డయాలసిస్ కేంద్రాన్ని నడుపుతున్నారు. శ్రీకాళహస్తి పరిధిలోనే కాకుండా సత్యవేడు, సూళ్లూరుపేట పేట నియోజకవర్గాల నుంచి కూడా ఇక్కడకు వచ్చి కిడ్నీ రోగులు డయాలసిస్ చేసుకుంటున్న పరిస్థితి. రోజులో సుమారు 50 డయాలసిస్ పేషెంట్లు ఇక్కడ డయాలసిస్ చేసుకుంటున్నారని డాక్టర్ రమణ, ఇన్‌ఛార్జి రమణ, మేనేజర్ పుదూరు గిరి తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కిడ్నీ రోగికి నెఫ్రో ప్లస్ సంస్థ తరపున ఉచిత డయాలసిస్ సేవలు అందుతాయని వారు తెలిపారు. డయాలాసిస్ రోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.10 వేలు పెన్షన్ సాయం చేసి ఆదుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

CHANGE OF SURNAME

I, VEDICHERLA NAGAMANI W/o VEDICHERLA MURALI(Old Name) Bearing Passport No.K4151188 resident of East Street,Chennuru, Chennuru-II, Gudur,Tirupati Dt. (A.P) Shall henceforth be known as

MARUPEDDI NAGAMANI W/o VEDICHERLA MURALI

(New Name)

శ్రీ సూళ్ళూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. / 2023
I.A.No. 537/ 2022
O.S.No. 174 / 2022
మినుకు శంకర్ .....వాది
Vs
మామిళ్ళ సాయప్పగారి వెంకటసుబ్బయ్య ..... ప్రతివాది

To
మామిళ్ళసాయప్పగారి వెంకటసుబ్బయ్య
S/o సుబ్బన్న R/o ఆత్రేయవీధి, రాఘవయ్యపేట, సూళ్ళూరుపేట టౌన్ & మండలం, తిరుపతి జిల్లా.

నోటీసు

ఇందు మూలముగా మీకు తెలియజేయునది మేమనగా వాది మీ మీద సూళ్ళూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో శాశ్వతపు ఇంజంక్షన్ కొరకు దావా వేసియున్నారు. సదరు కేసు మీ నోటీసు కొరకు తేది: 17.03.2023న పైకోర్టు వారు వాయిదా వేసియున్నారు. కావున సదరు తేదిన ఉదయం 10.30గంటలకు మీరు గానీ మీ తరపున ప్లీడరు గాని తప్పక హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని యెడల మీ పరోక్షమున పై కోర్టు వారు పై చెప్పబడిన వ్యాజ్యమును పరిష్కారము చేయుదురని తెలియజేయడమైనది.

వాది తరపు న్యాయవాది
T. తిలక్ కుమార్ B.A, L.L.B
అడ్వకేట్, సూళ్ళూరుపేట.